క్లుప్తంగా

ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు సాయం


నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న మహేశ్

జ్యోతినగర్: సమాజ సేవలో ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీలు నిలిచాయని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి మహేశ్ అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ ఇందిరమ్మ కాలనీ ట్రస్ట్ ఆవరణలో వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఎంతోమంది నిరుపేద, నిస్సహాయ విద్యార్థులకు, వృద్ధులు, దివ్యాంగులకు దాతల సహకారంతో సాయం అందిస్తుందన్నారు. ముందస్తు బాలల దినోత్సవం సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బాలల మధ్య కేక్ కట్‌చేసి మిఠాయిలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు ఆముదాల శ్రీనివాస్, గాజుల సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


బాలుడిని పరామర్శిస్తున్న మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బందారికుంటకు చెందిన సార్ల కార్తీక్ అనే మూడేళ్ల బాలుడు బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. చిన్నారి కుటుంబీకులు అప్పటికే రూ.8లక్షల పైగా వైద్యానికి ఖర్చుచేసినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నల్ల మనోహర్‌రెడ్డి ఎన్‌జీవో సహకారంతో రూ.19లక్షలు సమకూర్చి ఇటీవల వైద్యసాయం అందించారు. సోమవారం నల్ల మనోహర్‌రెడ్డి బాలుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డికి బాలుడి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీరు సరఫరా చేయాలి

సుల్తానాబాద్: తాగునీటిని సరఫరా చేయాలని పట్టణంలోని తొమ్మిదో వార్డు ప్రజలు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. సుల్తానాబాద్ నుంచి నీరుకుల్లకు రోడ్డు వేసిన కాంట్రాక్టర్ పైప్‌లైన్ చెడిపోతే మళ్లీ మరమ్మతులు చేయకుండా వదిలేశారన్నారు. ఎస్సారెస్పీ వెనుక వైపు ఉన్న కాలనీ ప్రజలకు మానేరు నుంచి వచ్చే నీరే ప్రధానమని తెలిపారు. 15 రోజులుగా ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు పేర్కొన్నారు. అధికారులు చొరవ తీసుకొని నీరు సరఫరా చేసేలా చూడాలని కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌ను వివరణ కోరగా పరిశీలించి చేసి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేయిస్తామన్నారు. ఇక్కడ రమేశ్ ,రాజేశ్, బాబు, రాజమ్మ, సౌందర్య, కార్తీక్, లక్ష్మి, సుగుణ, అఖిల, మహబూబ్, మొండయ్య తదితరులున్నారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న సాయికిషోర్ గౌడ్

యైటింక్లయిన్‌కాలనీ: వైకే ఫౌండేషన్ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి మడ్డి సాయి కిషోర్ గౌడ్ 27వ సారి రక్తదానం చేశాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బద్దం రాజవ్వ అనే మహిళకు సోమవారం అత్యవసరంగా ఓ నెగెటివ్ రక్తం అవసరం కాగా బాధిత కుటుంబ సభ్యులు వైకే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేశ్‌కు సమాచారం అందించారు. సురేశ్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మడ్డి కిషోర్ గౌడ్‌కు తెలపడంతో కిషోర్ గౌడ్ కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. 27వ సారి రక్తదానం చేసిన కిషోర్ గౌడ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కండెం సురేశ్, సంస్థ ప్రతినిధులు అభినందించారు.

చిన్నారులకు బాణసంచా, మిఠాయిలు పంపిణీ



రామగుండం: దీపావళి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని తబితా ఆశ్రమంలోని చిన్నారులతో మద్దెల దినేశ్ పండుగ సంబురాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు బాణసంచా, మిఠాయిలు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్ నాయక్, తదితరులున్నారు.

తుప్పు పడుతున్నయ్



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన చెత్త తరలించే రిక్షాలు తుప్పు పట్టడంతో పక్కన పడేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి చెత్తను తరలించేందుకు ట్రాక్టర్, మొక్కలకు నీటిని పట్టేందుకు ట్యాంకర్ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు గ్రామ పంచాయతీల్లో ఉన్న చెత్త రిక్షాలు వినియోగంలో లేకపోవడంతో తుప్పు పట్టగా పంచాయతీ సిబ్బంది పక్కన పడేస్తున్నారు. 'రాజుల సొమ్ము రాళ్ల పాలు' అన్న చందంగా ఉందని పలువురు వాపోతున్నారు.

డ్రెయినేజీ నిండా పిచ్చి మొక్కలే..



రామగుండం: పట్టణంలోని ప్రధాన వీధిలో ఉన్న డ్రైనేజీ నిర్మాణానికి మోక్షం కలలగడం లేదు. శిథిలావస్థకు చేరి పిచ్చి మొక్కలతో నిండుకుంది. దీంతో మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. ఫలితంగా దోమల బెడద, కూలుతున్న డ్రైనేజీలతో వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

జిల్లా కేంద్రానికి రాముడి పాదుకలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దపల్లి రూరల్ : అయోధ్యలో నిర్మించిన రామ మందిరంలో ప్రతిష్ఠించే శ్రీరాముడి పాదుకలు సోమవారం పెద్దపల్లికి చేరాయి. అయోధ్య నుంచి మొదలైన యాత్ర పలు రాష్ట్రాల్లోని వేద బ్రాహ్మణులు, భక్తులు దర్శనార్థం యాత్రగా బయల్దేరారు. సోమవారం నాటికి 2,350 కిలోమీటర్ల మేర పూర్తయింది. పెద్దపల్లిలో కొండపాక శ్రీనివాసాచార్యులు ఇంటిలో పూజలు నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ చెరువుకట్ట వద్దగల ఆంజనేయ స్వామి ఆలయంలో ఉంచగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రజకులు ఐక్యంగా ఉండాలి


ఎన్నికైన కమిటీ సభ్యులు

సుల్తానాబాద్ : రజకులు రాజకీయంగా ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని పట్టణ రజక యూత్ అధ్యక్షుడు నిట్టూరి గణేశ్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ సాయిరాం గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకులు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాజకీయ పార్టీలు గుర్తించి సముచిత స్థానం కల్పిస్తాయన్నారు. ఉపాధ్యక్షుడిగా నిట్టూరి శేఖర్, కో-ఆర్డినేటర్‌గా చాతల శివ, సభ్యులుగా నిట్టూరి రాజు, సతీశ్‌ను ఎన్నుకున్నారు. శ్రీనివాస్, గణేశ్, ప్రశాంత్, బబ్బులు, రవి, శ్రీని వాస్, నీరజ్, సాయి, రాకేష్, సందీప్, వేణు తదితరులున్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియా సింగరేణి యాజమన్యం సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆర్జీ-2 ఏరియా డీజీఎం (పర్సనల్) అండ్ అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని ఇంటెక్ వెల్ వద్ద పైపులైన్ మరమ్మతుల కారణంగా వారం రోజులపాటు ఆర్జీ-2 ఏరియాలోని యైటింక్లయిన్, పోతన కాలనీ వాసులకు రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

'అర్హులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి'

సుల్తానాబాద్ : నిరుపేద దళితులకు అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ మహిళలు పదేళ్ల క్రితం తమకు అర్హులని పట్టా సర్టిఫికెట్లు ఇచ్చే క్రమంలో రాజకీయ విభేదాలు కారణంగా ఇవ్వలేదని, విచారణ జరిపించి అర్హులైన దళిత కుటుంబాలకు ఇంటి స్థలాల సర్టిఫికెట్లు ఇస్తే నిర్మాణం చేపట్టుకుంటామని తెలిపారు. ఎస్సీలకు ఇంటి స్థలాలతో పాటు ఇల్లు నిర్మించాలని, పలు పార్టీల నాయకులను మహిళలు విన్నవించారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత


బియ్యం అందజేస్తున్న నాయకులు

ఎలిగేడు: మండలకేంద్రానికి చెందిన ఎన్నిగంటి రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు 50 కిలోల బియ్యం అందజేశారు.ఇక్కడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు తదతరులున్నారు.

ప్రమాదకరంగా నాలా రోడ్డు



కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ పరిధిలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ పపక్కనున్న ప్రధాన నాలా రోడ్డు ప్రమాదకరంగా మారింది. మేదరిబస్తీ నుంచి మార్కెట్‌కు నాలా పక్కనుంచి వెళ్లే ఈ రోడ్డు కూలిపోయి భారీ గుంతపడింది. వాహనదారులు, బాటసారులు గమనించకపోతే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. దీంతో స్థానికులు ప్రజలను అప్రమత్తం చేయడం కోసం కుంగిపోయిన ప్రాంతంలో బండ రాళ్లను అడ్డుగా పెట్టారు. ప్రమాదం చోటు చేసుకోక ముందే బల్దియా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గడ్డివాము దగ్ధం

ఓదెల: మండలంలోని గోపరపల్లె గ్రామంలో దాసరి ప్రతాపరెడ్డి అనే రైతుకు చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు నిప్పంటుకోవటంతో సోమవారం రాత్రి దగ్ధమైంది. పెద్దపల్లి నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ.40వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

నియామకం


నియామక పత్రం అందిస్తున్న పుట్ట మధు

మంథని: మండల బీఆర్ఎస్ మహిళా విభాగం ప్రచార కార్యదర్శిగా మేజర్ గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ పుప్పాల భాగ్యలక్ష్మిని నియమించారు. సోమవారం మంథనిలో ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు నియామక పత్రం అందించారు.

నూతన విద్యుత్ కేంద్రం స్థాపనకు కృషి


మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్

రామగుండం: రామగుండంలో నూతన విద్యుత్ కేంద్రం స్థాపనకు కృషి చేస్తానని, కుందనపల్లి గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ 20, 21, 22వ డివిజన్లలో పాదయాత్ర చేపట్టారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటువేయాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, సోమనపల్లి తదితర గ్రామాల్లోని బీఆర్ఎస్, టీడీపీ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా డీసీసీ అధ్యక్షుడు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బుచ్చయ్య, కత్తెరమల్ల తిరుపతి, చల్లా రవీందర్ రెడ్డి, గాదె సుధాకర్ తదితరులున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి..

గోదావరిఖని: కాంగ్రెస్‌పార్టీ గెలుపులో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించాలని రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాగూర్ కోరారు. భాస్కర్‌రావు భవన్‌లో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు, సీనియర్ నాయకులు ఎల్లయ్య, సమ్మయ్య, దినేష్ కనకరాజు, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు, ఎల్లయ్య, ఫ్లోర్‌లీడర్ మహంకాళిస్వామి, ఎండీ ముస్తఫా, రమేశ్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ (ఫైల్)

సుల్తానాబాద్ : అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పనకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈనెల 30న ఎన్నికలు జరగనుండగా అధికారులు పోలింగ్ కేంద్రాలపై దృష్టిసారించారు. ర్యాంపుల నిర్మాణం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు , దివ్యాంగులకు ఓటు వేసేందుకు ర్యాంపులు నిర్మాణం, వృద్ధులకు వీల్ చైర్స్ అందుబాటులో ఉండేలా రెవెన్యూ అధికారులు చేపట్టారు. పోలింగ్ కేంద్రాలతో పాటు సిబ్బందికి ఉండేందుకు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోలీసులు ఇప్పటికే సమస్యాత్మక, గ్రామాలతో పాటు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలను గుర్తించి పలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పలువురు వ్యక్తులను, మద్యం అమ్మకందారులను బైండోవర్ చేశారు. పల్లెల్లో, పట్టణాల్లో ఏ చిన్న సంఘటన జరిగినా పోలీసులకు సమాచారం ఉండేలా వీపీవోలను నియమించారు.

నో పార్కింగ్ చోటే..



జ్యోతినగర్: అందరూ నిబంధనలు పాటించాలని ఏర్పాటు చేసిన నో పార్కింగ్ బోర్డు వద్ద కొందరు యథేచ్ఛగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఎ న్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని హైస్కూల్ ఆవరణలో అసెంబ్లీ నియోజకవర్గ రి టర్నింగ్ అధికారి కార్యాలయం ముందు ఏర్పాటు నో పా ర్కింగ్ అని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయినా కొంద రు ఏమీ పట్టించుకోకుండా వాహనాలను పార్కింగ్ చేయడం ఏంటని పలువురు వాపోతున్నారు.

భక్తి శ్రద్ధలతో దీపావళి


జ్యోతినగర్ : సాంస్కృతిక ప్రదర్శనలు



జిల్లాలో దీపావళి వేడుకలను ఘనంగా జరుపు కున్నారు. ఇళ్లు, దుకాణాలను మామిడి తోరణాలు, బంతిపూలు, రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇళ్లలో కేదారేశ్వర వ్రతాలు, దుకాణాల్లో లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. సాయంత్రం చిన్నా పెద్దలంతా పటాకులు కాల్చుతూ సంబురాలు జరుపుకున్నారు. ఇంటి ముంగిళ్లను దీపాలతో అలంకరించారు. పండుగ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఎన్టీపీసీ రామగుండంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. పర్మనెంట్ టౌన్‌షిప్‌లో వేడుకలను చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ ప్రారంభించారు. – సాక్షి నెట్‌వర్క్



జ్యోతినగర్ : వేడుకల్లో పాల్గొన్న సీజీఎం కేదార్ రంజన్, తదితరులు


మంథని : లక్ష్మీపూజలో మంగళహారతి ఇస్తున్న పూజారి


జూలపల్లి : పటాకులు కాలుస్తున్న కుటుంబ సభ్యులు

ఉన్నా నిరుపయోగమే..



సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని శాస్త్రీనగర్ రాజీవ్ రహదారి పక్కన మున్సిపల్ అధికారులు సులభ్ కాంప్లెక్స్ నిర్మించారు. రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి నిర్మించినా ఏపుగా చెట్లు పెరగడంతో అది కనిపించడం లేదు. దీంతో ఉన్నా నిరుపయోగంగా మారిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సులభ్ కాంప్లెక్స్ ఉపయోగకరంగా మారాలంటే చుట్టుపక్కల చెట్లు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

మరుగుదొడ్లను మరిచారు ?



జూలపల్లి: మండలకేంద్రంలో 25 ఏళ్ల క్రితం క్రితం ఆర్టీసీ నిధులతో నిర్మించిన ప్రయాణ ప్రాంగణం ప్రయాణికులు అందుబాటులో లేక ఆదరణకు నోచుకోలేదు. దీంతో బస్టాండును పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరింది. ఈ మధ్య అధికారులు పాత బస్టాండ్లను పునరుద్ధరించే కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని బస్టాండ్‌కు రంగులు వేశారు. కానీ పక్కనే ఉన్న మరుగుదొడ్లను శుభ్రంచేసి రంగులు వేయకపోవడంతో ప్రయాణికులు వాడేందుకు పనిరాకుండా ఉన్నాయి. అధికారులు స్పందించి మరుగుదొడ్ల పునరుద్ధరణతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.